క్లుప్తంగా

25న షంషుద్దీన్ బాబా ఔలియా ఉరుసు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాల శివారులోని మల్కాచెరువు వద్ద ఉన్న హజరత్ షేక్ షంషుద్దీన్ బాబా ఔలియా దర్గా 77వ ఉరుసు ఈనెల 25న నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి గంథం తీయనున్నట్లు చెప్పారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన గుర్రంపై గంథాన్ని ఉంచి వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాల్లో ఊరేగిస్తామన్నారు. సోమవారం ఉదయం దర్గా వద్ద దీపారాధనలు చేసి మిలాద్ చదివి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

శ్మశానంలో బీడు పైపులు ఏర్పాటు



తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలో హిందూ శ్మశానవాటికలో అపహరణకు గురైన బీడు పైపుల స్థానంలో కొత్తవి ఏర్పాటుచేశారు. పెనుమాక, మెల్లెంపూడిలో శ్మశాన వాటికలలో మృతదేహాలను దహనం చేసేందుకు ఉపయోగించే బీడు పైపులను దొంగలు అపహరించారు. మృతదేహాల దహన సంస్కారాలకు స్థానికులు ఇబ్బంది పడుతుండడంతో దాత విజయభాస్కరరెడ్డి సహకారంతో సుమారు రూ.98 వేల వ్యయంతో కొత్తవి మంగళవారం ఏర్పాటు చేశారు. శ్మశానవాటిలో బీడు పైపులు ఏర్పాటు చేసినందుకు పెనుమాక వాసులు విజయభాస్కరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందండి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కౌలు రైతులందరూ గుర్తింపు కార్డులు తీసుకోవాలని దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన కౌలు రైతులందరూ సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారిని, గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి కౌలు రైతు గుర్తింపు కార్డులను పొందాలని, గత సంవత్సరం కౌలు రైతు కార్డు పొంది, ఈ సంవత్సరం కూడా అవే పొలాలను కౌలు చేసుకుంటున్నట్లయితే వాటిని రెన్యువల్ చేసుకోవాలని ఇందుకు సంబంధించి భూమి కలిగిన రైతు పట్టాదారు పాసుపుక్తం జిరాక్స్, రైతు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నెంబర్, కౌలు రైతు ఆధార్ జిరాక్స్, ఫోన్ నెంబర్, ఫొటోలతోపాటు భూమి కలిగిన రైతు అంగీకారపత్రాన్ని తీసుకుని సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు.

భూముల రిజిస్ట్రేషన్ సేవలు వినియోగించుకోండి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని దేవరపల్లి అగ్రహారం, చింతలపూడి, శృంగారపురం గ్రామాలకు సంబంధించిన రైతుల భూముల రీసర్వే ప్రక్రియ పూర్తయిందని, ఆ భూములకు సంబంధించి ఆయా సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పంచాయతీ కార్యదర్శి జాయింట్ సబ్ రిజిస్ట్రార్ హోదాలో రిజిస్ట్రేషన్ సేవలు అందిస్తారని తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మేడికొండూరు: బాల్యా వివాహాలు చట్టరీత్యా నేరమని చైల్డ్ రైట్స్ ఎడ్వకసీ ఫౌండేషన్ నిర్వాహకురాలు సయ్యద్ కరీమున్నీసా బేగం అన్నారు. మండల పరిధిలోని విశదల అడ్డరోడ్డులోగల ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘ సంస్కర్తలు రాజారామోహన్‌రాయ్, కందుకూరి వీరేశలింగం పంతులు ప్రజల్లో బాల్య వివాహాలపై చైతన్యం కల్పించారన్నారు. అనంతరం వాల్ పోస్టర్‌లు ఆవిష్కరించారు. బాల్య వివాహాలపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది రెహమాన్, రవికుమార్, కళాశాల ఏఓ సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: రైతు సమస్యలపై విజయవాడలో ఈనెల 30న జరిగే బహిరంగసభ, ధర్నాను జయప్రదంచేయాలని సీపీఎం నాయకులు జొన్నా శివశంకరరావు కోరారు. మంగళవారం ఉండవల్లిలో రాజధాని రైతు సంఘం విస్తృత సమావేశం నిర్వహించారు. సమావేశానికి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ సబ్సిడీ విధానాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందని, గిట్టుబాటు ధర రైతుకు రావడం లేదని, కరెంటు చార్జీలు విపరీతంగా పెంచివేశారని విమర్శించారు. రాజధాని డివిజన్ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వీరాస్వామి పాల్గొన్నారు.

పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



పారిశుద్ధ్య కార్మికులకు కొబ్బరి నూనె, సబ్బులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: నగరాన్ని పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి పారిశుద్ధ్య కార్మికులకు రూ.20లక్షల విలువైన కొబ్బరి నూనె, సబ్బులు, సేఫ్టీ జాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో నిరంతరం పనిచేస్తున్న సుమారు 400 మంది పారిశుద్ధ్య కార్మికులకు రూ.20లక్షల విలువైన కొబ్బరి నూనె, సబ్బులు, సేఫ్టీ జాకెట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ఆరు నెలలకు ఒకసారి వాటిని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఒక్కో పారిశుద్ధ్య కార్మికుడికి మూడు లీటర్ల పారాషూట్ కొబ్బరి నూనె, 24 పెద్ద సబ్బులు, రాత్రులు పనిచేసే కార్మికులకు సేఫ్టీ జాకెట్లు పంపిణీ చేశామన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో కార్మికులు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యంగా ఉండాలని, మీరు ఆరోగ్యంగా ఉంటేనే నగరం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ యు శారదాదేవి, అడిషనల్ కమిషనర్ హేమమాలిని తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో క్రీడా ప్రాంగణం ఏర్పాటు

నగర పాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరులో డాక్టర్ బాబూ జగ్జీవనరామ్ క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పేర్కొన్నారు. శ్రీశైలం నగర్ లో నిర్మిస్తున్న బీటీ రహదారుల నిర్మాణాలను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి ఎమ్మెల్యే ఆర్కే సోమవారం సాయంత్రం పరిశీలించిన విషయం విదితమే. స్థానిక యువకులు ఎమ్మెల్యే ఆర్కేని కలసి తమకు వాలీబాల్ ఆడుకోవడానికి కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఆయన పక్కనే ఉన్న లేఅవుట్ ఓపెన్ స్పేస్‌ను గుర్తించి ఆ స్థలంలో వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. యువకులకు ఇచ్చిన హామీ మేరకు మంగళవారం వాలీబాల్ కోర్టు ఏర్పాటుకు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టగా ఎమ్మెల్యే ఆర్కే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ...వాలీబాల్ కోర్టుకు గ్రావెల్ తోలించడంతోపాటు విద్యుత్ స్తంభాలు, కూర్చోవడానికి బల్లలు ఏర్పాటు చేయడంతోపాటు క్రీడా ప్రాంగణానికి డాక్టర్ బాబూ జగ్జీవనరామ్ క్రీడా ప్రాంగణంగా నామకరణం చేస్తామని తెలిపారు. అదే ప్రాంగణంలో బాబూ జగ్జీవనరామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న వారం రోజుల్లోగా క్రీడా ప్రాంగణం పనులను పూర్తి చేయాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థల పరిశీలన

నగర పాలక సంస్థ పరిధిలోని చినకాకాని కోళ్ల ఫారాలు సమీపంలోని స్వశక్తి కాంప్లెక్స్ వద్ద సుమారు 20 సెంట్ల స్థలంలో ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే ఆర్కే నగరపాలక సంస్థ అధికారులతో కలసి స్థల పరిశీలన చేశారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్ : ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తన సొంత నిధులు కేటాయించి దుగ్గిరాల మండలంలో ఆగిపోయిన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను, శ్మశానవాటికలో గ్రావెల్ ఫిల్లింగ్ కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) దుగ్గిరాల మండలం పెనుమూలి, చింతలపూడిలో పర్యటించారు. పెనుమూలి ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ఆగిపోవడంతో స్థానికులు కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని కోరడంతో, స్థానిక నాయకులతో కలసి స్థలాన్ని పరిశీలించి తన సొంత ఖర్చులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

శ్మశానవాటికలో గ్రావెల్ ఫిల్లింగ్....

దుగ్గిరాల మండలం చింతలపూడిలో హిందూ శ్మశాన వాటిక లోతట్టు ప్రాంతంలో ఉండడంతో వర్షాకాలంలో మృతిచెందిన వారికి అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇబ్బందిగా ఉందని స్థానికులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన తనసొంత ఖర్చులతో గ్రావెల్ ఫిల్లింగ్ పనులు చేపట్టారు. శ్మశానవాటికలో గ్రావెల్ ఫిల్లింగ్ చేయడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు(డీవీఆర్), ఎస్సీ సెల్ నాయకులు దాసరి వీరయ్య, యార్డ్ చైర్మన్ షేక్ బాజి, ఎంపీటీసీ సభ్యుడు షేక్ సల్మా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కొండూరు ముత్తయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కొరిటాల సురేష్, నజీర్, రమేష్, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ, ఎంఈఓ–2 బాధ్యతల స్వీకారం



ఎంఈఓ జి.సత్యనారాయణమూర్తి, ఎంఈఓ–2 డి.నాగేశ్వరరావులను సత్కరిస్తున్న నాయకులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి మండల విద్యాశాఖాధికారిగా జి.సత్యనారాయణమూర్తితోపాటు ఎంఈఓ–2 డి.నాగేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జి.సత్యనారాయణమూర్తిని, డి.నాగేశ్వరరావులను ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.జోజప్ప, మండల శాఖ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు బి.సురేష్‌బాబు, ఎల్.రవీంద్రరావు, గౌరవాధ్యక్షులు ఎస్.వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ అభినందనలు

ఎంఈఓ జి.సత్యనారాయణమూర్తి, ఎంఈఓ–2గా బాధ్యతలు స్వీకరించిన డి.నాగేశ్వరరావులను యూటీఎఫ్ మండల అధ్యక్షకార్యదర్శులు ఆనంద్ కుమార్, సుబ్బారావులు మంగళవారం కలసి అభినందించారు. అనంతరం వారిని సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆంజనేయులు, ధనరాజారావు, రాధాకృష్ణ, షంషాద్ బేగం, అన్నపూర్ణ, విజయరాణి, సుధారాణి, సుజాత, బురాన్, గఫార్, బుచ్చిబాబు, రామచంద్రారెడ్డి, ధన్వంతరి, మున్వర్, వెంకయ్య, బెన్హర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలుకి ఘనంగా వీడ్కోలు



ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలును సత్కరిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం ఈమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలుకు మంగళవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు రాఘవయ్య ఆధ్వర్యంలో ఈమని పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఐదుగురు ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం .ఏడుకొండలును సత్కరించి మెమొంటో అందజేశారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు రాఘవయ్య మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధి ఏడుకొండలు ఎంతో కృషి చేశారని అన్నారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం బెస్ట్ టీచర్ అవార్డు ఇచ్చి గౌరవించిందని అన్నారు. పాఠశాలలో నూరు శాతం ఫలితాలు సాధించేందుకు విశేష కృషి చేశారని కొనియాడారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు ఎన్‌డీవీఎల్ ఫణి, టి.లక్ష్మీసరోజ, టి.బాలకృష్ణ, డి.నాగవేణి సేవలను ఉపాధ్యాయులు కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బ్రహ్మేశ్వరం, బి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువకుని మృతదేహం లభ్యం



పాడుబడిన బావి నుంచి గోపాల్ మృతదేహాన్ని వెలికి తీస్తున్న గజ ఈతగాళ్లు

మంగళగిరి: క్షణికావేశంలో పాడుబడిన బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన యువకుని మృతదేహం మంగళవారం లభ్యమైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం రైస్‌మిల్ వీధికి చెందిన శిఖా గోపాల్ (35) సోమవారం సాయంత్రం క్షణికావేశంలో తన నివాస గృహం సమీపంలోని పాడుబడిన బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు బావిలోకి దిగి గోపాల్‌ను రక్షించే సాహసం చేయలేకపోయారు. అప్పటికే చీకటి పడటంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయ చర్యలు కొనసాగించలేకపోయారు. ఈ నేపథ్యంలో మంగళవారం గజ ఈతగాళ్లను రప్పించి గాలించారు. పాడుబడిన బావిలో చెత్త చెదారంతో పాటు పాత చెట్లు కొమ్మలు కొట్టేసి వేశారు. నీటిలో అడుగున ఉన్న చెట్టు కొమ్మల మధ్యలో గోపాల్ ఇరుక్కుపోయి మృతి చెందాడు. బావి మొత్తం పాచితో పాకుడు పట్టింది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. అతికష్టం మీద గోపాల్ మృతదేహాన్ని గజ ఈతగాళ్లు ఎంతో శ్రమించి బయటకు తీశారు. శవ పరీక్షల అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అందించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

150 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ

వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం



దివంగత నేత డాక్టర్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ముగ్గురోడ్డు మహిళలు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని నివాస స్థలాల పట్టాలు పొందిన మహిళలు మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ముగ్గురోడ్డు సెంటర్‌లో దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. ముగ్గురోడ్డు ప్రాంతంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన దాదాపు 150 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మాటలు చెప్పే ప్రభుత్వం కాదని, ఇచ్చిన మాట ప్రకారం ముగ్గురోడ్డులో ఇళ్లలేని నిరుపేదలతోపాటు రైల్వేస్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో, ఎమ్మెల్యే ఆర్కే, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి పట్టాలు పంపిణీ చేశారని, మరో ఆరు నెలలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇత్తడి పండు, జి.హైమావతి, రాణి, తిరుపతమ్మ, గోపి రవీంద్ర, ప్రభాకర్, నాగభూషణం, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నాం



ఇరవై ఏళ్లుగా ఇళ్లస్థలాల కోసం దరఖాస్తు చేసుకుంటూనే ఉన్నాం. రాజధానిలో కట్టిన టిడ్కో ఇళ్లకు సైతం దరఖాస్తు చేసుకున్నాం. అప్పట్లో కొంతమందికి మాత్రమే ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇప్పుడు మా వాడకట్టులో ఎవరికైతే సొంత ఇల్లు లేదో, ఎవరైతే రైల్వే స్థలాల్లో ఇళ్లు వేసుకున్నారో వారందరికీ ఇళ్లస్థలాలు కేటాయించారు. ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటాం.

– వరగాని సుబ్బులు

హామీలు నూరు శాతం అమలు

- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్
- తాతిరెడ్డిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



లాం శివారు తాతిరెడ్డిపాలెంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న సురేష్‌కుమార్

లాం(తాడికొండ): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో కొనసాగిన నాలుగేళ్ల పాలనలో ప్రతి పేదవాడికి ప్రయోజనం కలిగేలా నూరుశాతం హామీలు అమలు చేశారని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం లాం శివారు తాతిరెడ్డిపాలెం గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పాలన అందరికీ ఆదర్శవంతంగా నిలుస్తుందని, పక్క రాష్ట్రాల్లో కూడా మన పథకాలు అమలు చేసే పరిస్థితికి వచ్చిందంటే అది జగనన్న పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. అవినీతిని కాపాడుకునేందుకు బాబు అన్ని పార్టీల్లో ఉన్న తన అనుకూల వర్గాన్ని ముందుపెట్టి ప్రభుత్వంపై ఎల్లో మీడియాతో కలిసి దుష్ప్రచారానికి దిగుతున్నారని, వీరి మాటలు ప్రజలు నమ్మే దుస్థితిలో లేరని తెలుసుకొని మసలుకుంటే మంచిదన్నారు. రాజకీయ అజ్ఞానులు పవన్ కళ్యాణ్, లోకేష్‌లు యాత్రల పేరుతో రాష్ట్రంలో తిరుగుతూ నోటికొచ్చిందల్లా మాట్లాడుతున్నారని, ఎంతమంది స్టార్‌లు వచ్చినా ప్రజల మనసులు తెలుసుకొని వారికి సంక్షేమం అందిస్తూ రాజకీయాల్లో తనదంటూ ప్రత్యేక శైలిలో దూసుకెళుతున్న రియల్ స్టార్ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కళ్లం హరికృష్ణారెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, ఎంపీటీసీ రావూరి దివ్య, మైనార్టీ సెల్ నాయకులు షేక్ సలీమ్, మాజీ యార్డు చైర్మన్ అవుతు శ్రీనివాసరెడ్డి, యార్డు మాజీ వైస్ చైర్మన్ భీమవరపు బ్రహ్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, బీసీ సెల్ నాయకులు పసుపులేటి వెంకట్రావు, కొల్లికొండ వెంకటేశ్వరరావు, గ్రామ నాయకులు షేక్ సాదిక్, షేక్ మీర్జావలి, గోల్డ్ బాబు, హుస్సేన్ బాషా, గోలీ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

17 ఏళ్ల తర్వాత ఔట్‌పాల్ డ్రెయిన్ పూడికతీత

ఎమ్మెల్యే ఆర్కే చొరవపై రైతుల హర్షం



కాలువలో పూడికతీత నిర్వహిస్తున్న ప్రొక్లయినర్

తాడేపల్లిరూరల్ : రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు తాడేపల్లి రూరల్ ప్రాంతంలో పలు ప్రాంతాలను కలుపుతూ డ్రెయిన్ పూడికతీత పనులను మంగళవారం చేపట్టారు. చిర్రావూరు, గుండిమెడ, మంగళగిరి రూరల్‌లోని రామచంద్రాపురంలో ఔట్‌పాల్ డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో అధిక వర్షాలు పడినపుడు పంటపొలాలు మునిగిపోవడంతోపాటు ఆయా ప్రాంతాల్లో మురుగునీరు పొలాల్లోకి వచ్చి చేరడంతో రైతులు ఆరు కాలం కష్టపడి తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉండేది. చిర్రావూరు వైఎస్సార్ సీపీ కన్వీనర్, ఇప్పటం సొసైటీ ప్రెసిడెంట్ మేకల సాంబశివరావు తదితరులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి సమస్యను తీసుకువెళ్లడంతో స్పందించిన ఆయన కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి రూ.9.50 లక్షలు కేటాయించి డ్రెయిన్ పూడికతీత పనులు చేపట్టారు. దీనితో పాటు ఆంధ్రరత్న పంపింగ్‌స్కీమ్ పంటకాలువ సైతం పూడికతీత పనులను చేస్తున్నారు. ఈ పూడికతీత వల్ల గుండిమెడలోని కొంతభాగం, ప్రాతూరులోని కొంతభాగం, చిర్రావూరు, రామచంద్రాపురం పంటపొలాల్లో మురుగునీరు రేపల్లె కరకట్ట వెంబడి దిగువ ప్రాంతానికి పనులు చేపట్టినట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. భవిష్యత్తులో పక్కా డ్రెయిన్ నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు.

వసతి గృహ విద్యార్థుల విద్య, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

బీసీ సంక్షేమ వసతి గృహ వార్డెన్ల సమీక్షలో కత్తెర సురేష్‌కుమార్

తాడికొండ: వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థుల ఆరోగ్యం, విద్య పట్ల వార్డెన్లు శ్రద్ధ వహించాలని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం గుంటూరులోని నియోజకవర్గ కార్యాలయంలో బీసీ సంక్షేమ వసతి గృహాల వార్డెన్‌లతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో వసతి గృహాల్లో నూరుశాతం సీట్లు భర్తీచేసి పేద విద్యార్థులకు స్థానం కల్పించాలన్నారు. కుటుంబాలను వదిలి వసతి గృహాల్లో చదువుకునే పేద విద్యార్థుల పట్ల స్నేహభావంతో మెలగాలని, వారికి అందించే భోజనం నాణ్యతతో ఉండాలని, మెనూ తప్పకుండా పాటించి సంపూర్ణ పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యార్థులను నిత్యం పర్యవేక్షిస్తూ అనారోగ్య సమస్యలు దరిచేరనీయకుండా నెలకోసారి ప్రభుత్వ వైద్య బృందంతో పరీక్షలు చేయించాలని సూచించారు. వసతి గృహ పరిసరాలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని, తాను పరిశీలనకు వచ్చినపుడు లోపాలేమైనా గమనిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు వసతి గృహాల వార్డెన్లు భవానీ, శారదారాణి, సునీతాదేవి, లీలాభాయ్, సుధారాణి, ఆర్ శ్రీను, వెంకట్, విజయ భాస్కరరావు, సాంబశివరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల భారీ వర్షం



మంగళగిరి: నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఇప్పటికే ఎండలతో అల్లాడుతున్న జనం సేద తీరారు. డ్రెయిన్‌లు పొంగి పొర్లడంతో వీధులన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. భారీ ఈదురు గాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. విద్యుత్ వైర్ల మీద పడటంతో విద్యుత్ సరఫరా సైతం నిలిచిపోయింది. వర్షం తగ్గిన తరువాత విద్యుత్ సిబ్బంది సరఫరాను పునరుద్ధరించారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో సహాయ నిధి సేకరణ

తాడేపల్లిరూరల్ : త్రిపుర రాష్ట్రంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలపైన బీజేపీ, ఆర్ఎస్ఎస్ గూండాలు దాడులు చేస్తూ విధ్వంసం సృష్టిస్తున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు విమర్శించారు. దాడులకు గురై, నష్టపోయిన వారిని ఆదుకునేందుకు మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో కొలనుకొండ జాతీయ రహదారి పక్కన వ్యాపార సముదాయాల వద్ద సహాయ నిధి సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కాట్రగడ్డ శివన్నారాయణ, సామాల మోహన్‌రావు, బాణావత్ నాగేశ్వరరావు, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

తాడికొండ: మోతడక సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈఈ రవికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గాలుల కారణంగా పెద్ద లైన్‌లకు సంబంధించి రెండు విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయిన కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు తెలిపారు. మోతడక, నిడుముక్కల, ఎల్‌జీ పూడి, రావెల, అమరావతి మండలంలోని పలు గ్రామాలకు రెండు గంటల సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు అంతరాయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఎస్ఐ గిరిబాబు బాధ్యతల స్వీకారం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించేందుకు మరో ఎస్ఐను నియమించారు. ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో వట్టిచెరుకూరులో ఎస్ఐగా పనిచేసిన జి.గిరిబాబు కొంతకాలం లాంగ్‌లీవ్‌పై వెళ్లారు. ఇప్పుడు తాడేపల్లి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐగా వచ్చిన గిరిబాబుకు తాడేపల్లి పోలీసులు అభినందనలు తెలిపారు.

చెత్త తొలగించరూ..



ఫిరంగిపురం: ఫిరంగిపురం, వేములూరిపాడు గ్రామశివారు గుంటూరు–కర్నూలు రాష్ట్ర రహదారిపై ఒక వైపున చెత్త, గుడ్డల మూటలు, పాడైన కూరగాయలు, పదార్థాలు తీసుకొచ్చి వేస్తున్నారు. దీంతో అటువైపుగా వెళ్లాలంటే దుర్వాసన వస్తుందని, ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తుందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. పాడైన పదార్థాల కోసం కుక్కలు, పందులు వచ్చి వాహనాలకు అడ్డు వస్తుండటంతో ప్రమాదాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి వాటిని తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టిఫిన్ బండ్లు పంపిణీ

తాడేపల్లిరూరల్ : నగర పాలక సంస్థ పరిధిలోని బ్రహ్మానందపురం, డోలాస్‌నగర్ ప్రాంతాలకు చెందిన కందుకూరి భాగ్యలక్ష్మి, మకంమేరి, దారా మాధవి భాయ్, బొబ్బిలి సరోజని, షేక్ మహబున్నీసాలకు మంగళవారం ఎమ్మెల్యే ఆర్కే సహకారంతో తోపుడు బండ్లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకటరామిరెడ్డి, గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్ మేడా వెంకటేశ్వరరావు (పండు), గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ ప్రధానకార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, తాడేపల్లి పట్టణ ఎస్సీ యూత్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి దహన సంస్కారాలకు రూ.15వేలు సాయం

మంగళగిరి: అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన కాజ ఎస్సీ కాలనీకి చెందిన చిలకలపూడి ఫ్రాన్సిస్ దహన సంస్కారాల నిమిత్తం ఎమ్మెల్యే ఆర్కే రూ.15వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. స్థానిక పార్టీ నాయకుల ద్వారా మృతుడి కుటుంబానికి రూ.15వేలు అందించారు.

ఇరువురు బాధితులకు ఆర్థికసాయం

కాజ ఎస్సీ కాలనీకి చెందిన నాగళ్ల బాలరాజు, నాగళ్ల బాబూరావులకు ఎమ్మెల్యే ఆర్కే చెరో రూ.5వేలు చొప్పున స్థానిక పార్టీ నాయకుల ద్వారా అందించారు. మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ ఎ.బ్రహ్మర్గనరెడ్డి పాల్గొన్నారు.